ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
27-09-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 25 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB జయభేరి



## ఇది మీకు ఉద్యోగం కాదు
# ఒక భావోద్వేగం

"ఇది మీకు ఉద్యోగం కాదు. ఒక భావోద్వేగం. తెలంగాణ ప్రజల భావోద్వేగం నీళ్లతో ముడిపడి ఉంది. నీళ్లు నియామకాల ఆకాంక్షల కోసమే తెలంగాణ ఏర్పడింది. నీళ్లు మన సంస్కృతిలో భాగం. అలాంటి శాఖకు ప్రతినిధులుగా నియమితులవుతున్నారు. ప్రజల భావోద్వేగాలకు అనుగుణంగా నీళ్లను ఒడిసిపట్టి ప్రజలకు అందించాల్సిన బాధ్యత మీపై ఉంది" అని అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ AEE ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు.

**జయభేరి, హైదరాబాద్ :**

టీఎస్‌పీఎస్సీ ద్వారా AEE ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు నీటి పారుదల శాఖ కార్యాలయం జల సౌధలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి నియామక పత్రాలను అందించారు. ఈ సందర్భంగా AEE లను ఉద్దేశించి సీఎం పలు సూచనలు చేశారు. రాష్ట్రంలో గడిచిన పదేళ్లలో పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కాకపోవడానికి కారణాలేంటో గమనించాలి. హైదరాబాద్ జంట నగరాలకు మంచినీటి సౌకర్యాన్ని అందిస్తున్న ఉస్మాన్ సాగర్, హిమాయత్ సాగర్ నిర్మించిన ప్రముఖ ఇంజనీరు, భారతరత్న మోక్షగుండం విశ్వేశ్వరయ్యని ఆదర్శంగా తీసుకోండి. గడిచిన పదేళ్లలో రెండు లక్షల కోట్లు ఖర్చు చేసినా తెలంగాణ లో ప్రాజెక్టులు పూర్తి కాలేదు. భవిష్యత్తులో ఇలాంటివి పునరావృతం కారాదు. ఏ వృత్తి లోనైనా క్షేత్రస్థాయిలో అనుభవం ఉన్నవారే రాణిస్తారు. ప్రాజెక్టులు పూర్తి చేయడానికి ఇంజనీర్లుగా క్షేత్రస్థాయిలో పర్యటించాలి. తెలంగాణ పునర్నిర్మాణంలో నీళ్లు అత్యంత కీలకం. దేశంలోనే తెలంగాణను ఆదర్శంగా నిలపాలి. రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించాలి. కార్యక్రమ ముగింపులో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ... జల సౌధకు వచ్చిన మొట్టమొదటి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నని చెప్పారు.



## ఇంద్రసేనారెడ్డికి మిజోరాం గవర్నర్‌గా అదనపు బాధ్యతలు

**జయభేరి, హైదరాబాద్, సెప్టెంబర్ 26 :**


త్రిపుర గవర్నర్ నల్లు ఇంద్రాసేనారెడ్డికి మిజోరాం రాష్ట్ర గవర్నర్‌గా అదనపు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు గురువారం రాష్ట్రపతి భవన్ నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి. కాగా మిజోరాం గవర్నర్ డాక్టర్ హరిబాబు కంభంపాటి సెలవుపై వెళ్లడంతో ఇంద్రసేనారెడ్డికి అదనపు బాధ్యతలు ఇచ్చారు.

# 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్ల ఆవిష్కరణ




**జయభేరి, పుణె, సెప్టెంబర్ 26:**

దేశీయంగా అభివృద్ధి చేసిన మూడు సూపర్ కంప్యూటర్లను ప్రధాని మోదీ గురువారం ఆవిష్కరించారు. వాతావరణం, వాతావరణ పరిశోధనపై రూ.850 కోట్లతో ఏర్పాటుచేసిన కంప్యూటింగ్ వ్యవస్థను, శాస్త్రీయ పరిశోధన కోసం రూ.130 కోట్లతో పుణె, ఢిల్లీ, కోల్‌కతాలలో ఏర్పాటుచేసిన 'పరమ్ రుద్ర' సూపర్ కంప్యూటర్లను ప్రధాని వర్చువల్‌గా ప్రారంభించారు. కుంభవృష్టి, వేడి గాలు లు, తుఫాన్లు, భారీ వర్షం, వడగండ్ల వాన, కరువు పరిస్థితుల్ని అంచనా వేసేందుకు పుణె, నోయిడాల్లో అత్యంత శక్తివంతమైన కంప్యూటింగ్ వ్యవస్థలను తీసుకొచ్చారు.



# ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం

## ఉద్యోగ, ఉపాధి, క్రీడా రంగాల సమీక్షలో సీఎం చంద్రబాబు

**జయభేరి, అమరావతి:**

ఐదేళ్లలో యువతకు 20 లక్షల ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పిస్తామని ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీని నేరవేర్చే విధంగా ప్రణాళికలు సిద్ధం చేయాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. గురువారం సచివాలయంలో నైపుణ్య శిక్షణ శాఖ, ఎంఎస్ఎంఈ, పరిశ్రమలు, సెర్ప్ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చంద్రబాబు మాట్లాడుతూ నైపుణ్య శిక్షణ ద్వారా పరిశ్రమలకు అవసరమైన మానవ వనరులు సమకూర్చాలని సూచించారు.

...మిగతాది 2 లో

# లెబనాన్‌పై భూతల దాడులు

- సిద్ధమవుతున్న ఇజ్రాయెల్ సైన్యం
- 21 రోజుల కాల్పుల విరమణకు అమెరికా, మిత్రపక్షాల ప్రతిపాదన
- తోసిపుచ్చిన ఇజ్రాయెల్ ప్రభుత్వం
- తక్షణం లెబనాన్‌ను వీడాలని భారత పౌరులకు ఎంబసీ సూచన



**జయభేరి, బీరుట్, సెప్టెంబర్ 26:**

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు రోజురోజుకూ పెరుగుతున్నాయి. ఇజ్రాయెల్ హెజ్బొల్లా మధ్య యుద్ధం తీవ్రరూపం దాల్చుతున్నది. లెబనాన్‌పై గ్రౌండ్ ఆపరేషన్‌కు (భూతల దాడులకు) ఇజ్రాయెల్ సైన్యం సిద్ధమవుతున్నది. 21 రోజుల కాల్పుల విరమణ పాటించాలని అమెరికా, ఫ్రాన్స్ తదితర దేశాలు చేసిన ప్రతిపాదనను ఇజ్రాయెల్ తోసిపుచ్చింది. పూర్తిస్థాయిలో హెజ్బొల్లాపై దాడులు చేయాలని సైన్యాన్ని ఆదేశించింది. ఈ నేపథ్యంలో లెబనాన్ మరో గాజాలా మారనుందనే భయాందోళనలు వ్యక్తమవుతున్నాయి. మొన్నటి వరకు గాజాపై విరుచుకుపడిన ఇజ్రాయెల్ తన లక్ష్యాన్ని ఇప్పుడు లెబనాన్ వైపు మార్చింది. హెజ్బొల్లా మిలిటెంట్లే లక్ష్యంగా

...మిగతాది 2 లో



# రోడ్డున పడ్డ బతుకులు

## ఇక కోలుకునే మార్గమే లేదంటూ ఆవేదన
## హైడ్రా కూల్చివేతల తీరుపై కుటుంబాల్లో కన్నీళ్లు

2 లో

**జయభేరి, హైదరాబాద్ :**

ఇళ్లలోనో, దుకాణాల్లోనో, షెడ్లలోనో నివ సిస్తున్న.. వ్యాపారాలు చేసుకుంటున్న వారికి కనీస సమాచారం ఇవ్వకుండా, ఇచ్చినా ఖాళీ చేసేందుకు సమ యం ఇవ్వకుండా కూల్చివేతలు చేపడుతున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తమదుఃఖం తీర్చేదెవరని.. తమకు జరిగిన నష్టాన్ని పూడ్చేదెవరంటూ కన్నీళ్లుపెడుతున్నారు. 'హైడ్రా'తో చెరువుల ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్లలో వెలిసిన అక్రమ నిర్మాణాల కూల్చివేతపై తొలుత హర్షం వ్యక్తమైంది. కానీ ఆ తర్వాత హైడ్రా వ్యవహరిస్తున్న తీరు మా త్రం కుటుంబాల్లో కన్నీళ్లు నింపేలా ఉందంటూ బాధితులు మండిపడుతున్నారు. ఇళ్లు కట్టుకున్నవారే కాదు.. స్థలాలు, నిర్మాణాలను లీజుకు తీసుకుని వ్యాపారాలు పెట్టుకున్నవారూ హైడ్రా కూల్చివేతల్లో తీవ్రంగా నష్టపోయారు. ఎక్కడెక్కడి నుంచో బతుకుదెరువు కోసం వచ్చి.. కడుపు కట్టుకుని సంపాదించుకుంటున్న

# గడీలపై గళమెత్తి.. భూ పోరాటానికి నాంది

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు చాకలి (చిట్యాల) ఐలమ్మకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఘనంగా నివాళులు అర్పించారు. ఐలమ్మ జయంతి సందర్భంగా ముఖ్యమంత్రి జూబ్లీ హిల్స్ నివాసంలో ఆ వీరనారి చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. గడీలపై గళమెత్తి భూ పోరాటానికి నాంది పలికిన ఐలమ్మ బహుజన ఆత్మగౌరవానికి, మహిళా చైతన్యానికి ప్రతీకగా నిలుస్తారని స్మరించుకున్నారు. మహిళా లోకానికి స్ఫూర్తిగా నిలుస్తున్న వీరనారి ఐలమ్మ పేరును కోఠిలోని మహిళా విశ్వవిద్యాలయానికి పెట్టిన విషయాన్ని గుర్తుచేసుకున్నారు. ఆ యోధురాలి వారసులకు సముచిత గుర్తింపును కల్పించామని ముఖ్యమంత్రి పేర్కొన్నారు. సీఎంతో పాటు ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, ఎమ్మెల్యే శ్రీగణేష్, పలువురు నాయకులు ఉన్నారు.



# 78 వేలకు బంగారం



2 లో

▸▸ మొదటిపేజీ తరువాయి

## ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలిస్తాం

నైపుణ్యాలను పెంచడం ద్వారా పెద్దఎత్తున అవకాశాలు పొందే అవకాశం ఉందని, హైబ్రిడ్ విధానంలో ఇంటినుంచే పనిచేసే కార్యక్రమానికి ప్రాధాన్యం ఇవ్వాలని సూచించారు. బహుళజాతి కంపెనీలతో శిక్షణ కేంద్రాల ఏర్పాటు ప్రక్రియ చేపట్టాలన్నారు. విజయవాడ వరదల్లో సర్వం కోల్పోయిన బాధితులు ఉపాధి చూపించాలని కోరారని, వారికి ఎటువంటి ఉపాధి కల్పన చేపట్టవచ్చనే అంశంపై పరిశీలన జరిపి కార్యాచరణ అమలు చేయాలన్నారు. వివిధ కారణాలతో గ్రామాల్లో ఉండిపోయిన వారికి పనిచేసే అవకాశాలు కల్పిస్తే మంచి ఫలితాలు వస్తాయని, ప్రభుత్వం, పారిశ్రామికవేత్తలు కలిసి ఈ పని చేయాలని కోరారు. మౌలిక సదుపాయాల కల్పనతో క్రీడా రంగానికి తిరిగి ప్రోత్సాహం అందించాలని సీఎం చంద్రబాబు అధికారులను కోరారు. యువజన సర్వీసులు, క్రీడల శాఖపై సమీక్షిస్తూ.. గతంలో నిలిచిపోయిన 35 క్రీడా వికాస కేంద్రాలను పూర్తి చేసేందుకు రూ.23 కోట్లు మంజూరు చేస్తున్నట్టు సీఎం తెలిపారు. గ్రామాల్లో కబడ్డీ వంటి ఆటలకు క్రీడా మైదానాలు అందుబాటులోకి తేవాలని సూచించారు.

తిరుపతి, అమరావతి, విశాఖ నగరాలను క్రీడా హబ్‌లుగా మార్చాల్సిన అవసరం ఉందని, ఆ మూడు ప్రాంతాల్లో అన్ని క్రీడల నిర్వహణకు సకల సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. క్రీడా నగరంగా అమరావతిని తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందని, ఇక్కడ అతిపెద్ద స్టేడియం నిర్మాణం చేపడతామని చెప్పారు. 2027లో జాతీయ క్రీడా పోటీలను మన రాష్ట్రంలో నిర్వహించాలనే లక్ష్యంతో పని చేస్తున్నామని తెలిపారు. రాష్ట్ర సచివాలయం, కలెక్టరేట్లు, ఇతర ప్రభుత్వ కార్యాలయాల్లోనూ స్పోర్ట్స్ సెంటర్లు ఏర్పాటు చేయాలన్నారు. సమీక్షలో మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి పాల్గొన్నారు.

## రోడ్డున పడ్డ బతుకులు

తమ బతుకులు రోడ్డున పడ్డాయని వాపోతున్నారు. వడ్డీలకు అప్పులు తెచ్చి వ్యాపారాలు చేసుకుంటున్న షెడ్లను, భవనాలను ఉన్నట్టుండి కూల్చడంతో.. తీవ్రంగా నష్టపోయామని, ఇక తమ బతుకులు కోలుకునే అవకాశమే కనిపించడం లేదని కన్నీళ్లు పెడుతున్నారు. ఈ నెల 8న సున్నంచెరువు ఎఫ్‌టీఎల్, బఫర్‌జోన్లలోని ఒక గోడౌన్, మూడు భవనాలు, 20 గుడిసెలను అధికారులు కూల్చివేశారు. అందులో ఒక గుడిసెలో నివాసం ఉంటున్న బలహీనవర్గాలకు చెందిన ఎన్.నర్సింహ, అంజలి దంపతులు ఇరవయ్యేళ్ల క్రితం మాదాపూర్‌కు వలస వచ్చారు. స్థానిక నేతల సూచనతో అక్కడ గుడిసె వేసుకొని కూలిపనులు చేసుకుంటూ బతుకుతున్నారు. వారి కుమారుడు సాయిచరణ్ (17) కేన్సర్ వ్యాధితో బాధపడుతూ రెండు నెలల క్రితమే మృతిచెందాడు. ఆ దుఃఖం నుంచి కోలుకోకముందే వారి గుడిసె నేలమట్టమైంది. తలదాచుకునేందుకు నర్సింహ సోదరి ఇంటికి వెళ్లారు.

కానీ అటు కుమారుడిని, ఇటు గూడును కోల్పోయిన ఆవేదనతో.. అంజలి ఈనెల 21న ఛాతీనొప్పికి గురైంది. వెంటనే ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అదే రోజు రాత్రి ఆమె మృతి చెందింది. పాత జ్ఞాపకాలను వెతుక్కుంటూ కూల్చిన గుడిసె వద్దకు వచ్చిన నర్సింహ.. కొడుకు, భార్య ఇద్దరూ మరణించాక, తాను ఎవరి కోసం బతకాలో అర్థం కావడం లేదని వెక్కివెక్కి ఏడ్చారు.

కూకట్‌పల్లికి చెందిన విజయ్‌ప్రతాప్‌గౌడ్‌ది మరో కన్నీటి వ్యథ. కేటరింగ్ చేసే ఆయన వద్ద 68 మంది పనిచేస్తున్నారు. వారందరికీ అదే జీవనాధారం. విజయ్‌ప్రతాప్ భూమిని లీజుకు తీసుకొని, రూ.40 లక్షల వ్యయంతో షెడ్లు, సామగ్రి ఏర్పాటు చేసుకున్నారు. నల్లచెరువులో హైడ్రా కూల్చివేతల్లో భాగంగా ఆయన షెడ్లనూ కూల్చేశారు. కనీసం కేటరింగ్ సామగ్రి బయటికి తీసుకువెళ్లే అవకాశం ఇవ్వలేదని ఆయన వాపోయారు. తనతోపాటు పనిచేసేవారంతా ఉపాధి లేక రోడ్డునపడ్డామని ఆందోళన వ్యక్తం చేశారు. సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలతో తీవ్రంగా నష్టపోయానని మరో బాధితుడు పునారాం పేర్కొన్నారు. అక్కడ లక్షలు ఖర్చుపెట్టి గోడౌన్ నిర్మాణం చేపట్టానని, శానిటరీ సామాగ్రి కొంత అందులోనే ఉండిపోయిందని వాపోయారు. కొన్నిరోజులు గడువు ఇచ్చి ఉంటే సామగ్రిని పూర్తిగా తరలించే అవకాశం ఉండేదన్నారు. గోడౌన్, సామగ్రి కలిపి రూ.50 లక్షలకుపైగా నష్టపోయి.. రోడ్డునపడ్డానని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కూకట్‌పల్లిలో రవి జిరాక్స్, ప్రింటింగ్ ప్రెస్‌కు సంబంధించిన దుకాణం నిర్వహిస్తున్నాడు.

హైడ్రా ఒక్కసారిగా కూల్చివేతలు చేపట్టడంతో తీవ్రంగా నష్టపోయానని వాపోయాడు. తన భార్య గర్భవతి అని, సామగ్రి తీసుకునేందుకు కాస్త గడువు ఇవ్వాలని కోరినా అధికారులు కనికరించలేదని కన్నీళ్లు పెట్టుకున్నాడు. తాను, మరికొందరు కలసి నాలుగు రోజులు కష్టపడి కొంత సామగ్రిని బయటికి తీసినా.. అది చాలా వరకు పాడైపోయిందని వాపోయారు. తనతో పాటు మరెందరో నష్టపోయారని ఆవేదన వ్యక్తం చేశారు.

## లెబనాన్‌పై భూతల దాడులు

గత కొద్ది రోజులుగా ఆ దేశంపై గగనతల, రాకెట్ల దాడులతో విరుచుకుపడుతున్నది. సోమవారం నుంచి లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన దాడిలో 630 మంది మరణించారు. వేలాది మంది గాయపడ్డారు. లెబనాన్ ఉత్తర, తూర్పు ప్రాంతాలపై ఇజ్రాయెల్ 75 లక్షిత దాడులు చేసింది. దీనికి ప్రతిగా లెబనాన్ చేసిన 45 దాడులను తాము సమర్థంగా తిప్పికొట్టినట్టు ఇజ్రాయెల్ ప్రకటించింది. తాజాగా ఇజ్రాయెల్ బుధవారం రాత్రి లెబనాన్‌లోని ఒక భవనంపై జరిపిన దాడిలో సిరియా కార్మికులు, వారి కుటుంబ సభ్యులు 23 మంది మరణించారని లెబనాన్ అధికారి తెలిపారు. రెండు దేశాల మధ్య ఉద్రిక్తతల నివారణకు పలు అగ్రరాజ్యాలు చేస్తున్న ప్రయత్నాలు ఫలితాలు ఇవ్వడం లేదు. 21 రోజుల పాటు తాత్కాలిక కాల్పుల విరమణ పాటించాలంటూ యూఎస్, యూకే, ఈయూ విజ్ఞప్తి చేశాయి. అయితే దీనిని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తోసిపుచ్చారు. హెజ్బొల్లాపై పూర్తిస్థాయిలో దాడి చేయాలని ఆదేశించారు. అదే సమయంలో ప్రస్తుతం లెబనాన్‌పై దాడులు జరుపుతున్నప్పటికీ తమ యుద్ధ లక్ష్యం నెరవేరే వరకు గాజాపై కూడా దాడులు కొనసాగుతూనే ఉంటాయని స్పష్టం చేసింది. ఇరు దేశాల మధ్య ఉద్రిక్తతలు తగ్గించాలని లెబనాన్ ప్రధాని నజీబ్ మికాటి కోరారు.

న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో జరిగిన అత్యవసర సమావేశంలో ఆయన మాట్లాడుతూ గగన దాడులతో పాటు ఎలక్ట్రానిక్ పరికరాలతో జరుగుతున్న దాడుల వల్ల లెబనాన్ పౌరులలో భయం నెలకొందని అన్నారు లెబనాన్‌లో నెలకొన్న యుద్ధ పరిస్థితుల కారణంగా అక్కడ నివసిస్తున్న భారత పౌరులు దేశాన్ని విడిచివెళ్లాలని, అక్కడే ఉండాలనుకునే వారు జాగ్రత్తలు పాటించాలని బీరుట్‌లోని భారత ఎంబసీ కార్యాలయం విజ్ఞప్తి చేసింది. ఏదైనా అవసరమైతే బీరుట్‌లోని భారత దౌత్య కార్యాలయాన్ని సంప్రదించాలని కోరింది. లెబనాన్‌పై ఇజ్రాయెల్ జరిపిన క్షిపణి దాడిలో లైవ్ టీవీ ఇంటర్వ్యూ జరుపుతున్న లెబనాన్ జర్నలిస్టు ఒకరు స్వల్పంగా గాయపడ్డారు. మిరయా ఇంటర్నేషనల్ నెట్‌వర్క్ ఎడిటర్‌ఇన్‌చీఫ్ ఫడీ బౌంద్య ఒక లైవ్ ఇంటర్వ్యూలో ఉండగా, ఇజ్రాయెల్ ప్రయోగించిన మిస్సైల్ ఒకటి అతని ఇంటిని తాకింది. దీంతో ఆయన బిగ్గరగా అరుస్తూ స్క్రీన్‌కు దూరంగా పడ్డారు.

## పాలస్తీనా మా సొంతం

▸▸ మేం వదిలి వెళ్లం: అబ్బాస్

**న్యూయార్క్:**

గాజా ప్రాంతంపై ఇజ్రాయెల్ చేపట్టిన సైనిక దాడులను పాలస్తీనా అథారిటీ చీఫ్ మహ్మూద్ అబ్బాస్ తీవ్రంగా ఖండించారు. పాలస్తీనా మా సొంతం. పాలస్తీనా నుంచి వెళ్లిపోవాల్సిన వారు ఎవరూ అంటే ఆక్రమణదారులు మాత్రమే' అని ఆయన అన్నారు. గురువారం అబ్బాస్ ఐరాస జనరల్ అసెంబ్లీలో ప్రసంగించారు. ఆయన స్టేడియం వైపు వెళ్తుండగా కరతాళధ్వనులు, చప్పట్లు హాలంతా మారుమోగాయి. అర్థంకాని కేకలు వినిపించాయి. పోడియం వద్దకు చేరుకున్న అబ్బాస్..మేం వదిలి వెళ్లం. మేం వదిలి వెళ్లం. మేం వదిలి వెళ్లం..అంటూ ప్రసంగం మొదలుపెట్టారు.గాజాను, అక్కడి ప్రజలను అంతం చేసేందుకు ఇజ్రాయెల్ కొనసాగిస్తున్న నరమేధాన్ని ఆపాలంటూ ప్రపంచ నేతలకు ఆయన విజ్ఞప్తి చేశారు. గాజాను నివాసయోగ్యం కాకుండా చేస్తోంది. యుద్ధానంతరం ఏర్పడే గాజాను మేమే పాలిస్తాం. పాలస్తీనా మా మాతృ భూమి. మా తండ్రులు, తాతలది. అది ఎప్పటికీ మాదే. వెళ్లిపోవాల్సింది ఎవరైనా ఉంటే వారు ఆక్రమిత వడ్డీవ్యాపారులు మాత్రమే'అని వ్యాఖ్యానించారు.

# ఆరు నెలల్లో ఆయకట్టుకు సాగునీరు

✍ **జయభేరి, హైదరాబాద్ :**



రాష్ట్రంలోని సాగునీటి ప్రాజెక్టులను ప్రాధాన్యత క్రమంలో పూర్తి చేయాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఆరు నెలల్లో వీలైనంత ఆయకట్టుకు సాగునీటిని అందించే ప్రాజెక్టులను మొదటి ప్రాధాన్యంగా ఎంచుకోవాలని సూచించారు. రాబోయే రెండేండ్లలో పూర్తయ్యే ప్రాజెక్టుల పనులను వేగవంతం చేయాలని ఇరిగేషన్ శాఖకు దిశా నిర్దేశం చేశారు. పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై జలసౌధలో మంత్రులు, నీటి పారుదల శాఖ ఉన్నతాధికారులతో నిర్వహించిన సమావేశంలో ముఖ్యమంత్రి సమీక్షించి పలు సూచనలు చేశారు. ఇప్పటికే 75 శాతం, అంతకు మించి పనులు చేసిన ప్రాజెక్టులను పూర్తి చేస్తే వచ్చే ఖరీఫ్‌లోగా మరింత ఆయకట్టుకు సాగునీరు అందించే అవకాశముంది. అటు గోదావరి బేసిన్, ఇటు కృష్ణా బేసిన్‌లో ప్రాధాన్యంగా ఎంచుకున్న ప్రాజెక్టులకు నిధులకు ఇబ్బంది లేకుండా చూడాలని ఆర్థిక శాఖకు ఆదేశాలు. తక్కువ సమయంలో ఎక్కువ ఆయకట్టుకు నీటిని అందించే ప్రాజెక్టులకు గ్రీన్ చానల్ ద్వారా బిల్లుల చెల్లింపులు జరగాలి. కొనసాగుతున్న ప్రాజెక్టుల కోసం ముందుగా భూసేకరణ వేగంగా పూర్తి చేయాలి. అందుకు రెవిన్యూ విభాగంతో సమన్వయం చేసుకోవాలి. భూసేకరణలో మానవీయత ఉండాలి. భూములు ఇచ్చే వారితో అధికారులు, ప్రజాప్రతినిధులు కలిసి సంప్రదింపులు జరపాలి. రాష్ట్రంలో వివిధ ప్రాజెక్టుల పరిధిలో పేరుకుపోయిన పూడిక తీతపై ఇతర రాష్ట్రాలు అనుసరిస్తున్నవిధానాలు, సాధ్యాసాధ్యాలను పరిశీలించాలి. ఏ ఏ ప్రాజెక్టులు తొందరగా పూర్తి చేసేందుకు అవకాశాలున్నాయి. వాటికి అవసరమైన నిధుల వివరాలను నీటి పారుదల శాఖ అధికారులు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. ఇదే సమావేశం నుంచి అన్ని జిల్లాల ఎస్ఈలతో సీఎం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మాట్లాడారు.

# జీహెచ్ఎంసీ డబుల్ కసరత్తు

▸▸ మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్ణయంతో జీహెచ్ఎంసీ అప్రమత్తం

▸▸ అసంపూర్తి పనులపై ప్రభుత్వానికి సమాచారం

▸▸ నిర్మాణాలకు 3 వేల కోట్లు కావాలని అంచనా

▸▸ మూసీ నిర్వాసితులకు 15 వేల ఇళ్లు అవసరం

✍ **జయభేరి, హైదరాబాద్, :**



మూసీ నిర్వాసితులకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు కేటాయిస్తామన్న ప్రభుత్వ ప్రకటనతో జీహెచ్ఎంసీ అప్రమత్తమైంది. వేర్వేరు కారణాల వల్ల గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో ఏడాదిన్నరగా నిలిచిపోయిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పనుల పునఃప్రారంభంపై కసరత్తు మొదలుపెట్టింది. ఇళ్ల నిర్మాణం ఏ దశలో ఉంది.? పనులు పూర్తి చేయడానికి ఎంత డబ్బు కావాలి ? ఇప్పటికే పూర్తయిన ఇళ్లెన్ని ? కేటాయించినవి ఎన్ని ? తదితర వివరాలతో ప్రభుత్వానికి ఓ నివేదిక పంపింది. దాని ప్రకారం వివిధ దశల్లో నిలిచిన 25వేలకు పైగా డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణానికి రూ.3000 కోట్లు అవసరమని జీహెచ్ఎంసీ అధికారులు అంచనా వేశారు. ఇప్పటికే నిర్మాణం పూర్తయిన ఇళ్లు 4500 ఉన్నాయి. మూసీ నిర్వాసితులకు 15వేల ఇళ్లు అవసరమున్న దృష్ట్యా మరో 10 వేల ఇళ్లు సిద్ధం చెయ్యాల్సి ఉంది. ఈ నేపథ్యంలో తుది దశకు చేరుకున్న ఇళ్ల నిర్మాణ పనులు తొలుత పూర్తి చేయాలని భావిస్తున్నారు.

**4,591 ఇళ్లు సిద్ధం.. 10,500 అవసరం**

గత ప్రభుత్వం జీహెచ్ఎంసీ పరిధిలోని 109 ప్రాంతాల్లో రూ.9714 కోట్ల అంచనా వ్యయంతో లక్ష.. డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల నిర్మాణాన్ని చేపట్టింది. వీటిలో 95,315 ఇళ్ల నిర్మాణ పనులు ప్రారంభం కాగా కోర్టు కేసులు ఇతర కారణాల వల్ల 4,685 ఇళ్ల పనులు ప్రారంభం కాలేదు. మొత్తం 69,673 ఇళ్ల నిర్మాణం పూర్తవగా 64,369 ఇళ్లను లబ్ధిదారులకు కేటాయించారు. పూర్తయిన వాటిలో 4,591 ఇళ్లు ఖాళీగా ఉన్నాయి. ఇందులో అప్పటికే ఉన్న నిర్మాణాలు కూల్చి ఆ స్థలంలోనే కట్టిన 1952 ఇళ్లు కూడా ఉన్నాయి. మూసీ నిర్వాసితులకు ఇళ్లు కేటాయించాలంటే ప్రస్తుతం సిద్ధంగా ఉన్న 4591 ఇళ్లకు అదనంగా మరో 10,500 కావాలి.

అయితే, పెండింగ్‌లో ఉన్న బిల్లులను చెల్లించడంతోపాటు ప్రస్తుత ధరలకు అనుగుణంగా టెండర్లలో మార్పులు చేస్తేనే పనులు చేపట్టగలమని కాంట్రాక్టర్లు అంటున్నారు. వందల కోట్ల బిల్లులు బకాయి ఉండడంతో ఏడాదిన్నరగా కాంట్రాక్టర్లు పనులు నిలిపివేశారు. అసెంబ్లీ ఎన్నికల ముందు కొన్ని నిధులు విడుదల చేయడంతో తుది దశలో ఉన్న ఇళ్ల నిర్మాణం పూర్తి చేశారు. ఆ తర్వాత పనులు పూర్తిగా నిలిచిపోయాయి. అసంపూర్తి పనులు పూర్తి చేయాలని జీహెచ్ఎంసీ..కాంట్రాక్టర్లను కోరగా ఎనిమిదేళ్ల క్రితం ధరల ప్రకారం పనులు చేయలేమని తేల్చి చెప్పారు. తాజా ఎస్ఎస్ఆర్ ప్రకారం బిల్లులు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. అదే జరిగితే నిర్మాణ వ్యయం మరింత పెరగనుంది.

**జీహెచ్ఎంసీలో డబుల్ ఇళ్ల స్వరూపం**

ప్రతిపాదిత డబుల్ బెడ్‌రూమ్ ఇళ్లు 1,00,000, అంచనా వ్యయం 9714.59 కోట్లు, నిర్మాణం మొదలైనవి 95,315, వివిధ కారణాలతో పనులు ప్రారంభించనవి 4,685, పూర్తయినవి 69,673, కేటాయించినవి 64,369, తాళాలు ఇచ్చినవి 59,366, సిద్ధంగా ఉన్న ఇళ్లు 4,591, వివిధ దశల్లో ఉన్న ఇళ్లు 25 వేలకుపైగా...

# కఠిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకోం

▸▸ తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదు

▸▸ పరుష వ్యాఖ్యల తొలగింపు కోసం గుజరాత్ చేసిన అభ్యర్థనను తోసిపుచ్చిన కోర్టు

✍ **జయభేరి, న్యూఢిల్లీ:**



బిల్కిస్ బానో రేప్, కుటుంబసభ్యుల హత్య కేసు దోషుల మిగిలిన శిక్షా కాలాన్ని రద్దు(రెమిషన్) చేస్తూ గుజరాత్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని తప్పుబడుతూ గత తీర్పులో తాము చేసిన పరుషవ్యాఖ్యలను తొలగించబోమని సర్వోన్నత న్యాయస్థానం స్పష్టంచేసింది.

కోర్టు వ్యాఖ్యానాల తొలగింపు అంశాన్ని పునర్‌సమీక్షించాలంటూ గుజరాత్ ప్రభుత్వం పెట్టుకున్న పిటిషన్‌ను సుప్రీంకోర్టు జడ్జీలు జస్టిస్ బీవీ నాగరత్న, జస్టిస్ ఉజ్జల్ భూయాన్‌ల ధర్మాసనం తోసిపుచ్చింది. '' రివ్యూ పిటిషన్‌లో ఎలాంటి పస లేదు. గతంలో తీర్పు సందర్భంగా మేం చేసిన వ్యాఖ్యానాల్లో ఎలాంటి తప్పు లేదు. ఈ కోణంలో గత తీర్పును సమీక్షించాల్సిన అవసరం లేదు'' అని కోర్టు స్పష్టంచేసింది. దోషులు రెమిషన్‌పై నిర్ణయం తీసుకునే హక్కు గుజరాత్‌కు ఉంటుందని 2022 మేలో సుప్రీంకోర్టులోని మరో బెంచ్ చెప్పడంతోనే తాము తుది నిర్ణయం తీసుకున్నామని గుజరాత్ ప్రభుత్వం వాదించింది. అయితే మహారాష్ట్రలోని సీబీఐ కోర్టులో కేసు విచారణ జరిగినందున రెమిషన్‌పై నిర్ణయం తీసుకునే అధికారం మహారాష్ట్ర ప్రభుత్వానికి మాత్రమే ఉంటుందని, ఆ అధికారాన్ని గుజరాత్ బలవంతంగా లాక్కుందని, తన విచక్షణాధికారాన్ని దుర్వినియోగం చేసిందని సుప్రీంకోర్టు తీర్పు చెప్పడం తెల్సిందే. 11 మంది దోషుల రెమిషన్‌ను రద్దుచేస్తూ సుప్రీంకోర్టు ఈ తీర్పు వెలువరించింది. గోధ్రాలో రైలు దహనం ఉదంతం తర్వాత 2002లో గుజరాత్‌లో ముస్లింలపై దాడుల సందర్భంగా ఐదునెలల గర్భిణి అయిన బిల్కిస్ బానోను రేప్ చేసి, ఆమె మూడు నెలల కూతురుసహా ఏడుగురు కుటుంబసభ్యులను ఈ 11 మంది చంపేయడం తెల్సిందే.



## చెరువులో అక్రమ కట్టడం.. పేల్చివేత

▸▸ శిథిలాలు తగిలి హోంగార్డుకు తీవ్ర గాయాలు

✍ **జయభేరి, కొండాపూర్:**

హైడ్రాను స్ఫూర్తిగా తీసుకొని సంగారెడ్డిలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు అక్రమ నిర్మాణాలను కూల్చివేస్తున్నారు. గురువారం కొండాపూర్ మండలం మల్కాపూర్ చెరువులో ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన బహుళ అంతస్తుల భవనాన్ని కూల్చివేసేందుకు ఉదయం ఘటనాస్థలానికి చేరుకున్నారు. ముందస్తుగా పెద్దఎత్తున పోలీసులను మోహరించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధిలో నిర్మించిన భవనం పూర్తిగా నీటిలో ఉండటంతో బుల్డోజర్ల సహాయంతో కూల్చివేసేందుకు వీలు కాలేదు. దీంతో తహసీల్దార్ జిలెటిన్ స్టిక్స్ స్పెషలిస్టులను పిలిపించి వారి సహాయంతో భవనాన్ని పూర్తిగా కూల్చివేశారు. అయితే భవనం కూలుస్తున్న సమయంలో అక్కడే ఉన్న హోంగార్డు గోపాల్‌కు రాయి ఎగిరి వచ్చి బలంగా తాకడంతో తలకు గాయాలయ్యాయి. వెంటనే అతడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

కొండాపూర్ మండలం కుతుబ్‌షాహీ పేట శివారులోని సర్వే నంబర్ 93లో ఉన్న చెరువుకు సంబంధించిన మూడెకరాల భూమిని సికింద్రాబాద్‌కు చెందిన ఓ వ్యక్తి కొనుగోలు చేశాడు. అక్కడ ఐదంతస్తుల భవనంతోపాటు స్విమ్మింగ్ పూల్, గెస్ట్‌హౌస్‌ను నిర్మించాడు. ఆ భవనం ఎఫ్‌టీఎల్‌లో ఉండటంతో భవనం చుట్టూ నీరు చేరకుండా ప్రత్యేకంగా చిన్నపాటి బ్రిడ్జిని కూడా నిర్మించుకున్నాడు. ఇది నిర్మించి 12 ఏళ్లయింది. అయినా హైడ్రా కూల్చివేతలు ప్రారంభమయ్యాక, గ్రామస్తులు ఫిర్యాదు చేసే వరకు అధికారులు తమకేమీ పట్టనట్లుగా వ్యవహరించడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువులో నిర్మాణానికి ఎలా అనుమతి ఇచ్చారని ప్రశ్నిస్తున్నారు. కొత్తగా వచ్చిన అధికారులు భవనాన్ని పరిశీలించడం, మామూళ్లు తీసుకోవడం పరిపాటిగా మారిందని అంటున్నారు.

## 78 వేలకు బంగారం

▸▸ మరో రూ.400 పెరిగిన తులం విలువ

▸▸ రికార్డు స్థాయికి దూసుకుపోయిన ధర

✍ **జయభేరి, న్యూఢిల్లీ, సెప్టెంబర్ 26:**

బంగారం ధరలు రికార్డు స్థాయిలో దూసుకుపోతున్నాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు ఎన్నడు లేని గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో దేశీయంగా వరుసగా రెండోరోజూ రూ.78 వేల మార్క్‌ను అధిగమించాయి. అంతర్జాతీయ మార్కెట్లో అతి విలువైన లోహాల ధరలు ఎన్నడు లేని గరిష్ఠ స్థాయికి చేరుకోవడంతో దేశీయంగా వరుసగా రెండోరోజూ రూ.78 వేల మార్క్‌ను అధిగమించాయి. దేశ రాజధాని ఢిల్లీలో తులం పుత్తడి ధర రూ.400 ఎగబాకి రూ.78,250 పలికింది. పండుగ సీజన్ కూడా తొడవడంతో పాటు గ్లోబల్ మార్కెట్లో ధరలు పుంజుకోవడం వల్లనే ధరలు రికార్డు స్థాయికి చేరుకున్నాయని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ వెల్లడించింది. బుధవారం గోల్డ్ ధర రూ.77,850 పలికింది. బంగారంతోపాటు వెండి ధరలు మరింత అధికమయ్యాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి మద్దతు లభించడంతో కిలో వెండి రూ.1,000 అధికమై రూ. 94 వేలకు చేరుకున్నది. ఇటు హైదరాబాద్‌లో 24 క్యారెట్ గోల్డ్ ధర రూ.77,020 వద్ద కొనసాగుతుండగా, 22 క్యారెట్ ధర రూ.70,600 వద్ద ఉన్నది. కిలో వెండి ధర రూ.1,01,000కి చేరుకున్నది. మరోవైపు, అంతర్జాతీయ మార్కెట్లైన కోమెక్స్ మార్కెట్లో ఔన్స్ గోల్డ్ ధర 2,701.20 డాలర్లకు చేరుకోగా, వెండి 32.86 డాలర్ల వద్ద ఉన్నది. ద్రవ్యోల్బణం కట్టడి చేయడానికి ఇప్పటి వరకు వడ్డీరేట్లను పెంచుకుంటూ పోయిన పలు సెంట్రల్ బ్యాంక్‌లు ప్రస్తుతం వడ్డీరేట్లలో కోతలు పెడుతుండటం, దీనికి తోడు పశ్చిమాసియా దేశాల్లో మరోసారి ఉద్రిక్త పరిస్థితులు నెలకొనడం కూడా పసిడికి డిమాండ్ నెలకొన్నదని బులియన్ వర్తకులు వెల్లడించాయి. రూపాయితో పోలిస్తే డాలర్ విలువ క్రమంగా పడిపోతుండటం కూడా మరో కారణమన్నారు.

# ఎంబీబీఎస్ విద్యార్థిని చదువుకి బాసటగా ఉప్పల్ ఎమ్మెల్యే

- ఎంబీబీఎస్ విద్యార్థులకు అండగా నిలుస్తున్న ఉప్పల్ ఎమ్మెల్యేనీ అభినందించిన జిల్లా కలెక్టర్ గౌతమ్ పొట్రూ, మల్కాజ్ గిరి ఎంపీ ఈటల రాజేందర్



**జయభేరి, ఉప్పల్ :**

చిలుక నగర్ డివిజన్ కి చెందిన సత్యనారాయణ కుమార్తె బిట్ట కీర్తన కామినేని అకాడమీ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చ్ సెంటర్ LB నగర్ లో ఎంబీబీఎస్ 2వ సంవత్సరం చదువుతుంది. ఫీజు కట్టలేక ఇబ్బంది పడుతున్న విషయం తెలుసుకున్న ఉప్పల్ శాసనసభ్యుడు బండారు లక్ష్మారెడ్డి గారు తన స్వంత నిధులతో BLR చారిటబుల్ ట్రస్ట్ ద్వారా ఎంబీబీఎస్ కి అయ్యే ఫీజు 60,000/రూపాయల చెక్కును జిల్లా కలెక్టర్ కార్యాలయంలో అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి మాట్లాడుతూ.. ఉప్పల్ నియోజకవర్గ పరిధిలోని ఎవరైనా ఎంబీబీఎస్ సీటు సాధిస్తే ఫీజు మొత్తం తానే చెల్లిస్తామని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో BRS పార్టీ రాష్ట్ర నాయకులు బన్నాల ప్రవీణ్ ముదిరాజ్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్ సర్కార్ గజ్వేల్ అభివృద్ధిని అడ్డుకుంటుంది

- ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 26 :**

గజ్వేల్ నియోజకవర్గం అభివృద్ధిపై కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణిని వీడనాడాలని ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన స్థానిక మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం వివిధ అభివృద్ధి పనుల కోసం మంజూరీ చేసిన నిధులను రద్దు చేయకుండా తిరిగి కేటాయించాలని సూచించారు. సుమారు రూ 200 కోట్లు కేటాయిస్తే అసంపూర్తిగా నిలిచిన రింగ్ రోడ్డు, రహదారులు వంటి శాశ్వత పనులు పూర్తి చేసుకోవచ్చని స్పష్టం చేశారు. అంతేకాకుండా మాతా శిశు కేంద్రాన్ని పూర్తి స్థాయిలో వినియోగంలోకి తేవాలని సూచించారు. కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాల నిధులు కేటాయించాలని, సీఎం రిలీఫ్ ఫండ్ వెంట వెంటనే మంజూరు చేయాలని కోరారు. ముఖ్యంగా వేల కోట్ల వ్యయంతో చేపట్టిన వివిధ అభివృద్ధి పనులు అందుబాటులోకి తేవాల్సిన బాధ్యత ప్రస్తుత కాంగ్రెస్ సర్కార్ పై ఉందని వివరించారు.

## యువతతోనే సమాజ మార్పు

- ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్



**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ పట్టణ పరిధిలోని MKR డిగ్రీ కాలేజ్ లో ఏర్పాటు చేసిన 10వ గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమంలో పాల్గొన్న దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలు నాయక్ కళాశాలకు కావలసిన అన్ని వసతి సౌకర్యాలు కల్పించడానికి అహర్నిశలు కృషి చేస్తామన్నారు. యువతతోనే సమాజ మార్పు సాధ్యమని ఎమ్మెల్యే బాలు నాయక్ అన్నారు. తమ ప్రభుత్వం యువతను ప్రోత్సహించేందుకు త్వరలో క్రీడల అభివృద్ధి కోసం చర్యలు చేపడతామని వెల్లడించారు. యోగా, ధ్యానంతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని, యువత మానవత్వం, సమానత్వం, దయాగుణాలు అలవర్చుకోవాలన్నారు. యువత తల్చుకుంటే ఎలాంటి మార్పునైనా తీసుకురాగలదాన్నారు. ఈ కార్యక్రమంలో నల్గొండ పార్లమెంట్ కోఆర్డినేటర్ సిరాజ్ ఖాన్, మాజీ ఎంపీపీ జాన్ యాదవ్, ZPTC అరుణ సురేష్ గౌడ్, సినియర్ నాయకులు శిరందస్ కృష్ణయ్య, పిఎసిఎస్ చైర్మన్ డాక్టర్ వేణుధర్ రెడ్డి, యువజన విభాగ నాయకులు కొర్ర రాంసింగ్ నాయక్, కిన్నెర హరికృష్ణ, కళాశాల బృందం తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యమాల బిడ్డ వీరనారి ఐలమ్మ

- తన చివరి శ్వాస వరకు ఎర్ర జెండా వీడని చాకలి ఐలమ్మ
- ఆమె స్ఫూర్తితో యువత ముందుకు సాగాలి
- దొరలకు వ్యతిరేకంగా ఉద్యమించిన బిడ్డ ఐలమ్మ
- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు తూంకుంట నర్సారెడ్డి



**గజ్వేల్, సెప్టెంబర్ 26 :**

తెలంగాణ పోరు బిడ్డ, వీరనారి చాకలి ఐలమ్మ జీవితం ప్రతి ఒక్కరికి స్ఫూర్తిదాయకమని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు, గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే తూంకుంట నర్సారెడ్డి పేర్కొన్నారు. గురువారం గజ్వేల్ లో చాకలి ఐలమ్మ జయంతి వేడుకల్లో పాల్గొని గజ్వేల్ ఏఎంసీ చైర్మన్ నరేందర్ రెడ్డి, మున్సిపల్ మాజీ చైర్మన్ గాడిపల్లి భాస్కర్, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్ ఖాన్ లతో కలిసి ఆయన మాట్లాడారు. తొలి భూ పోరాటానికి నాంది పలికిన చిట్యాల ఐలమ్మ చాకలి ఐలమ్మగా పేదల గుండెల్లో చిరస్థాయిగా నిలిచినట్లు స్పష్టం చేశారు. తన మాటలను తూటాలుగా మలుచుకొని దొరల గడీలను గడగడలాడించిన వీరనారి ఐలమ్మ తెలంగాణ రైతాంగ విప్లవాగ్నిగా నిలిచినట్లు గుర్తు చేశారు. మొదటగా పాలకుర్తి దొరలపై ఉద్యమించిన ఆమె ఎన్నో అవమానాలు, కుటుంబ అఘాయిత్యాలు భరించి భూ పోరాటాలకు శ్రీకారం చుట్టిన ఐలమ్మ పేద బడుగు బలహీన వర్గాలను చైతన్యం చేస్తూ ఎర్రజెండాతో దొరల గుండెల్లో నిద్రించినట్లు చెప్పారు. ఆమె పోరాటం, ఉద్యమ స్ఫూర్తిని యువత ఆదర్శంగా తీసుకోవాలని, ఆధునిక పరిణామానికి నాంది పలికి చక్కటి భవిష్యత్తుకు బాటలు వెయ్యాలని ఆకాంక్షించారు. తెలంగాణ ఉద్యమాన్ని రగిలించిన తొలితరం వీరనారి చాకలి ఐలమ్మ జయంతి వేడుకలను ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో రజక సంఘం బాధ్యులు మెతుకు నర్సింలు, శ్రీధర్, రాజయ్య, నేతలు రవీందర్ రెడ్డి, సుభాష్ చంద్రబోస్, గాడిపల్లి శ్రీనివాస్, లక్ష్మారెడ్డి, మోహన్, రాములు గౌడ్, సత్యనారాయణ, కరుణాకర్ రెడ్డి, యాదగిరి, సురేష్, కన్నా యాదవ్, రమేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

## ముదిరాజులను గుర్తించని కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే చేప పిల్లల పంపిణీ చేపట్టాలి

- ముదిరాజుల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలి.
- మహాసభ రాష్ట్ర వైస్ చైర్మన్ కొట్టాల యాదగిరి ముదిరాజ్




**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 26 :**

ముదిరాజుల సంక్షేమాన్ని కాంగ్రెస్ సర్కార్ నిర్లక్ష్యం చేస్తుందని ముదిరాజ్ మహాసభ రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ ఆరోపించారు. గురువారం గజ్వేల్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాకాలం చివరి దశకు చేరుకుంటున్నప్పటికీ చెరువులు, కుంటల్లో చేప పిల్లల విత్తనాలు వేయకపోవడంతో ముదిరాజులు, గంగపుత్రుల పరిస్థితి ఆగమ్య గోచరంగా మారిందని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా 26357 చిన్న నీటి వనరులు ఉండగా, గత ప్రభుత్వం రూ 100 కోట్లు కేటాయించి సకాలంలో నాణ్యమైన చేప పిల్లలను పంపిణీ చేసినట్లు స్పష్టం చేశారు. అయితే ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం టెండర్ల పేరిట నిర్లక్ష్యం చేయడంతో నేటి వరకు చేప పిల్లల పంపిణీ జరగలేదని ఆవేదన వ్యక్తం చేశారు. గత కెసిఆర్ ప్రభుత్వం గ్రామాల్లోని మత్స్యకార సొసైటీలకు భాగస్వామ్యం కల్పించి చేపల పెంపకం చేపట్టగా, ప్రస్తుతం అందుకు భిన్నమైన పరిస్థితి నెలకొన్నట్లు విమర్శించారు. గ్రామాల్లోని చెరువులు కుంటల్లో సంవృద్ధిగా నీరు చేరిందని, దీనిని దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని, కాలం మరింత దాటితే చేపల పెరుగుదలపై తీవ్ర ప్రభావం చూపి ముదిరాజులు, గంగపుత్రులకు నష్టం వాటిల్లే ప్రమాదం ఉందని అన్నారు. చేప విత్తనం కనీసం మూడు ఈంచులకు తగ్గకుండా ఉండాలని, తద్వారా ప్రభుత్వ లక్ష్యం నెరవేరి మత్స్యకారులకు ఆర్థిక ప్రయోజనం చేకూరుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ముదిరాజ్ సంఘం నేతలు నర్సింలు, భాస్కర్, మనోహర్, రమేష్, చంద్రం, సత్యనారాయణ, వెంకటేష్, నాగరాజు పాల్గొన్నారు.

## సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ

- ప్రతి ఆడబిడ్డ చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలి.. బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్



**జయభేరి, దేవరకొండ :**

తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, మహిళాశక్తికి, బహుజన ధీరత్వానికి ప్రతీక చాకలి ఐలమ్మ అని నల్లగొండ జిల్లా బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు,దేవరకొండ మాజీ శాసన సభ్యులు రమావత్ రవీంద్ర కుమార్ అన్నారు. గురువారం దేవరకొండ పట్టణంలో చాకలి ఐలమ్మ జయంతి వేడుకలలో పాల్గొని ఆమె విగ్రహానికి పూల మాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భూస్వాములపై గర్జించిన సివంగి చాకలి ఐలమ్మ అని ఆయన అన్నారు.తెలంగాణ వీరవనిత,ఆధునిక సమాజ స్థాపనకు నాంది పలికిన స్త్రీ ధైర్యశాలి, దేశ్ ముఖ్,రజాకార్ల అరాచకాలపై ఎదురుతిరిగిన ధీశాలి, తెలంగాణ రైతాంగ విప్లవ స్ఫూర్తి ప్రదాత స్వర్గీయ చాకలి ఐలమ్మ అని అన్నారు. ఆధిపత్య వాదం ఎక్కు పెట్టిన ఆయుధం, అన్యాయాన్ని నిలదీసిన వీరవనిత, వివక్షత పై చైతన్య పోరాడిన యోధురాలు అని ఆయన తెలిపారు. దొరతనము ఎదిరించి వీరత్వం, భూస్వాములపై గర్జించిన సివంగి అని కొనియాడారు.

ఆకలికి అతి చేరువైన చాకలి కులంలో పుట్టి చీమల శతక చేతి వృత్తి దారులు అరిగొస పడుతున్న కాలంలో భూస్వాములు పటేళ్లు పట్వారీల కాళ్ల కింద నలిగిపోతున్న వర్గాలకు పోరాట మార్గం చూపిన ఆశాదీపం అని,ప్రతి ఒక్కరు చాకలి ఐలమ్మ పోరాట స్ఫూర్తితో దేశంలో, రాష్ట్రంలో జరుగుతున్నటువంటి ఆడ పిల్లల మీద అత్యాచారాలను ప్రతిఘటించాలని అన్నారు. ప్రతి ఆడబిడ్డ చాకలి ఐలమ్మను స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని కోరారు.

ఈ కార్యక్రమంలో మాజీ వైస్ ఎంపీపీ చింతపల్లి సుభాష్, బిఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేముల రాజు, నియోజకవర్గ అధ్యక్షుడు బొడ్డుపల్లి కృష్ణ, యువజన విభాగం పట్టణ అధ్యక్షుడు పొట్ట మధు, మండల అధ్యక్షుడు రమావత్ తులిసిరాం నాయక్ బిఆర్ఎస్ నాయకులు నాగవారం ప్రభాకర్ రావు, ఇలియాస్ పటేల్, బాబా, చంద్రమౌళి, జనిబాబ, ఆఫ్రోజ్, గండూరి లక్ష్మణ్, SK. జమిర్ బాబా, జూలూరు రమేష్ గౌడ్, నజీర్, లెండల లక్ష్మీకాంత్, మహ్మద్ షదబ్, గుండాల వెంకట్, శ్రీను, తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా చాకలి ఐలమ్మ జయంతి

**గజ్వేల్, సెప్టెంబర్ 26 :**

తెలంగాణ సాయుధ పోరాటంలో ఐలమ్మ ప్రదర్శించిన ధైర్యసాహసాలు, ప్రజాస్వామిక పోరాటాలకు స్ఫూర్తిగా నిలిచాయని బారాస సిద్ధిపేట జిల్లా యువజన అధ్యక్షుడు నాగరాజు మరియు రజక సంఘం గ్రామ అధ్యక్షుడు పెంటయ్య కొనియాడారు. వర్గల్ పట్టణములోని చాకలి ఐలమ్మ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భూమి కోసం, భుక్తి కోసం, వెట్టిచాకిరి నుంచి విముక్తి కోసం సాగిన సాయుధ పోరాటంలో ఆ ప్రదర్శించిన తెగువను గుర్తు చేసుకున్నారు. అందరికీ ఆమె జీవితం నిదర్శనంగా నిలిచిందన్నారు. హక్కుల కోసం ఐలమ్మ చేసిన ఆత్మగౌరవ పోరాట స్ఫూర్తితో ముందుకు సాగాలన్నారు. ఈ కార్యక్రమంలో గోపాల్, పరశురాం, రజక సంఘం నాయకులు మరియు బారస గ్రామ పార్టీ అధ్యక్షులు కర్ణాకర్, దిలీప్ ,భాస్కర్, శ్రీకాంత్, గోపాల్, కృష్ణ, యాదగిరి బీసీజేఏసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు

## 4వ రోజుకు చేరిన భూ నిర్వాసితుల ఆందోళన

- భూనిర్వాహితుల సమస్యలను పరిష్కరించేంత వరకు కం పెనీలు నడవనీయం



**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 26 :**

వర్గల్ మండల కేంద్రంలో టీజీఐఐసి లో భూములు కోల్పోయిన రైతులకు పూర్తిస్థాయి దక్కాల్సిన పరిహారాన్ని వెంటనే అందించాలని, పరిహారంతో పాటు ప్లాట్లు ఇచ్చేంతవరకు ఆందోళన చేపడుతూనే ఉంటామని, కంపెనీల నిర్మాణాలను అడ్డుకుంటామని తెలిపారు. అప్పటి కెసిఆర్ ప్రభుత్వం రైతులకు తక్కువ పరిహారాన్ని ఇచ్చి భూములను బలవంతంగా లాక్కొని అధిక ధరలకు కంపెనీలకు కట్టబెట్టి రైతులను నట్టేట ముంచిందన్నారు. రైతులు ఆందోళనలు చేపడుతున్న గజ్వేల్ మాజీ సీఎం, ప్రస్తుత ఎమ్మెల్యే కెసిఆర్ పట్టించుకోకపోవడంతో రైతులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.టిజిఐఐసి, రెవెన్యూ అధికారులు స్పందించి సమగ్ర సర్వేలు నిర్వహించి అర్హులైన ప్రతి ఒక్కరికి ఇండ్ల ప్లాట్ల లతోపాటు సరియైన పరిహారాన్ని అందించాలని డిమాండ్ చేశారు.

## మహేంద్ర షోరూంకు పర్మిషన్ లేదు



**జయభేరి, గజ్వేల్, సెప్టెంబర్ 26 :**

గజ్వేల్ నుండి తూప్రాన్ వెళ్లే రహదారిలో మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్ కు పర్మిషన్ లేదంటూ సంగుపల్లి గ్రామ 6,7 వార్డులకు చెందిన ప్రజలు , మాజీ కౌన్సిలర్ కలిసి మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గజ్వేల్ ప్రజ్ఞాపూర్ పరిధిలోని సర్వేనెంబర్ 594 లో గల మహీంద్రా ట్రాక్టర్ షోరూమ్ కు ఎటువంటి మున్సిపల్ అనుమతులు లేకుండా కబ్జా చేశారని తెలిపారు. అలాగే షెడ్డు వేసి షోరూంకు కిరాయి కి ఇచ్చారని చెప్పారు. గజ్వేల్ కు చెందిన ఐల వేణు గోపాల్ s/o సత్యనారాయణ కబ్జా చేసి ప్రహరీ గోడ నిర్మించుకున్నారని అదే భూమి కోర్టు కేసు నం ఓఎస్ NO 430 ఆఫ్ 2021 లో ఉందన్నారు.. కాబట్టి సదరు వ్యక్తిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్ కు వినతి పత్రం అందజేశారు

## పోరాట స్ఫూర్తికి ప్రతీక.. ఐలమ్మ



**మేడ్చల్ :**

వీరనారి చిట్యాల ఐలమ్మ అంటేనే పోరాట స్ఫూర్తికి ప్రతీక అని గుండ్లపోచంపల్లి రజక సంఘం అధ్యక్షుడు మలిగే అశోక్ రజక అన్నారు. గురువారం చాకలి ఐలమ్మ జయంతిని పురస్కరించుకుని గుండ్లపోచంపల్లి లోని మినీ ట్యాంక్ బండ్ పై ఉన్న ఐలమ్మ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం అశోక్ మాట్లాడుతూ.. తెలంగాణ రైతాంగ పోరాటంలో ఆమె చూపిన తెగువ మనందరికి ఆదర్శమని చెప్పారు. తెలంగాణ రాష్ట్ర సాధన పోరాటంలో ఐలమ్మ నిత్య స్మరణీయురాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో గుండ్లపోచంపల్లి రజక సంఘం అధ్యక్షుడు మలిగే అశోక్, నాయకులు శ్రీకాంత్, కిషోర్, శివ, యాదయ్య, బాలయ్య, శంకర్, వినోద్ తదితరులు పాల్గొన్నారు

## డిగ్రీ మహిళా కళాశాలలో స్పాట్ అడ్మిషన్స్

**జయభేరి, దేవరకొండ :**

దేవరకొండ లోని స్థానిక గిరిజన సంక్షేమ గురుకుల డిగ్రీ మహిళా కళాశాలలో డిగ్రీ ప్రథమ సంవత్సర ప్రవేశాల కోసం పూర్తిచేసిన విద్యార్థినులు బీసీ, ఎస్సీ, ఎస్టీ మహిళా విద్యార్థినులకు అవకాశం కల్పించడం జరిగింది. 27/09/2024 నాడు స్పాట్ అడ్మిషన్స్ జరుగుచున్నవి. ఆసక్తిగల బీసీ, ఎస్సీ, ఎస్టీ విద్యార్థినిలు స్పాట్ కౌన్సిలింగ్ కి హాజరు కాగలరని కళాశాల ప్రిన్సిపల్ ఎన్.శ్వేత తెలియజేసినారు స్పాట్ కౌన్సిలింగ్ కి హాజరయ్యే విద్యార్థినులు అన్ని ఒరిజినల్ సర్టిఫికెట్స్ (బోనోఫైడ్, 10 ఫోటోలు, ఆధార్ కార్డ్ ) రెండు జిరాక్స్ కాపీలు తీసుకొని రాగలరు. అదనపు వివరాల కోసం సంప్రదించవలసిన ఫోన్ నెంబర్లు:9908330585, 6300144583.



# కాకరకాయ రసంతో పొడవు జుట్టు పొందడం ఎలా?

కాకరకాయ మీరు చెప్పగానే చాలామందికి నచ్చదు. కానీ కాకరకాయతో జుట్టు ఆరోగ్యాన్ని కాపాడుకోవచ్చు. జుట్టు పెరుగుదలను ప్రోత్సహించవచ్చు. కాకరకాయతో జుట్టును ఎలా పెంచుకోవాలో తెలుసుకోండి.

కాకరకాయ ఆరోగ్యానికి ఎంతో మంచిది. వారానికి కనీసం రెండు మూడు సార్లు కాకరకాయతో చేసిన వంటకాలు తినమని పోషకాహార నిపుణులు చెబుతారు. అయితే దీని రుచి నచ్చక చాలామంది తినరు. నిజానికి కాకరకాయ తినడం వల్ల మన శరీరంలో ఉన్న అన్ని అవయవాలకు మేలే జరుగుతుంది. ఇది రోగనిరోధక శక్తిని బలోపేతం చేయడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. కాబట్టి కాకరకాయను ఏదో రకంగా ఆహారంలో భాగం చేసుకోవడం ఎంతో మంచిది. ఇది జుట్టు పెరుగుదలను కూడా ప్రోత్సహిస్తుంది. జుట్టును పొడవుగా పెరిగేలా మెరిసేలా చేస్తుంది.
2016లో చేసిన ఒక అధ్యయనంలో కాకరకాయలో ఉండే కణాలు జుట్టు పెరుగుదలను ప్రోత్సహిస్తాయని తేలింది. చర్మం నిపుణులు కూడా ఈ విషయాన్ని ధ్రువీకరించారు. ఇవి మాడుకు పోషణను ఇచ్చే జుట్టు కుదుళ్లను బలోపేతం చేస్తాయని చెప్పారు.

**కాకరకాయ వల్ల లాభాలు**

కాకరకాయలో యాంటీ మైక్రోబయల్, యాంటీ ఆక్సిడెంట్ లక్షణాలు ఎక్కువ. ఇది తలపై ఆక్సీకరణ ఒత్తిడిని తగ్గిస్తుంది. దీనివల్ల జుట్టు రాలకుండా ఆగుతుంది. అలాగే తలపై ఉన్న మాడును ఇది హైడ్రేటెడ్ గా ఉంచుతుంది. ఇందులో ఉండే విటమిన్లు వెంట్రుకలను అందంగా, పొడవుగా పెరిగేలా చేస్తుంది. ఇది జుట్టుకు సహజమైన కండిషనర్ల పనిచేస్తుంది. జుట్టును విరిగిపోకుండా నిరోధిస్తుంది. కాకర రసాన్ని తాగగలం అనుకునేవారు చిటికెడు ఉప్పు వేసి ప్రతిరోజు కాకరకాయ రసం తాగితే మంచిది. చిన్న గ్లాస్‌తో కాకరకాయ రసాన్ని తాగినా చాలు, దాని ఫలితం ఎంతో ఎక్కువ కనిపిస్తుంది. వారం రోజుల్లోనే మీ జుట్టు బాగా పెరుగుతుంది.

**కాకరకాయతో ఇలా చేయండి**

కాకరకాయ రసంతో హెయిర్ మాస్క్ కూడా తయారు చేసుకోవచ్చు. కాకరకాయ రసాన్ని తీసి మీ మాడుకు నేరుగా అప్లై చేయండి. అరగంట పాటు అలా వదిలేసి సాధారణ షాంపుతో కడిగేయండి. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మీ జుట్టు పెరుగుదల బాగుంటుంది. కాకరకాయ ముక్కను తీసుకొని మాడు పై బాగా మూడు నిమిషాల పాటు రుద్దినా మంచి ఫలితం వస్తుంది. కాకరకాయ రసంలో పెరుగు లేదా కొబ్బరి నూనె కలిపి హెయిర్ మాస్కుగా వాడండి. జుట్టుకు బాగా పట్టించాక పావుగంట పాటు వదిలేయండి. ఆ తర్వాత నీటితో శుభ్రం చేసుకోండి. కాకరకాయ నూనెను తయారు చేసుకోవచ్చు. కొబ్బరి నూనె లేదా ఆలివ్ నూనెలో కాకరకాయ ముక్కలను వేసి కొన్ని రోజులు పాటు ఉంచండి. తర్వాత ఆ ముక్కలను పిండి తీసేయండి. ఆ నూనెను జుట్టుకు పట్టించండి. ఇది ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తుంది.
అన్నిటికంటే ముఖ్యంగా కాకరకాయను మీ ఆహారంలో భాగం చేసుకుంటే మంచిది. రోజుకు చిన్న గ్లాస్ తో కాకరకాయ రసాన్ని గుటుక్కున మింగేయండి. ఇది మీకు అన్ని రకాలుగా ఆరోగ్యాన్ని అందిస్తుంది.





# పిల్లల ఏడుపుకు కారణాలు

చంటి పిల్లల ఏడుపుకు ఆకలి ఒక్కటే కారణం కాదు, వీటి వల్ల కూడా ఏడవవచ్చు, జాగ్రత్తలు తీసుకోండి

చంటి పిల్లలు ఆకలితో ఉన్నప్పుడు మాత్రమే ఏడుస్తారని అనుకుంటారు. కానీ వారికి ఏడుపుకు అనేక కారణాలు ఉన్నాయి. ఏడ్చినప్పుడల్లా పాలు పెట్టడమే కాదు, ఇతర ఇబ్బందులు ఉన్నాయేమో కూడా చూసుకోండి.

నెలల పిల్లలను చాలా జాగ్రత్తగా చూసుకోవాలి. వారి ప్రతి అవసరాన్ని తల్లే అర్థం చేసుకుని ఆ అవసరాన్ని తీర్చాలి. పసికందులు సాధారణంగా రోజుకు రెండు నుండి మూడు గంటలు ఏడుస్తారు. చాలా సందర్భాలలో, పిల్లలు ఏడుపుకు ఆకలి అతిపెద్ద కారణంగా చెప్పుకోవచ్చు. కానీ పిల్లలు కేవలం ఆకలితో ఉన్నప్పుడు మాత్రమే ఏడవరు? పిల్లలు ఏడుపుకు అనేక ఇతర కారణాలు ఉన్నాయి. చిన్న పిల్లలు ప్రతి విషయాన్ని ఏడుపుతోనే తల్లికి చెప్పేందుకు ప్రయత్నిస్తారు. వారికి తెలిసిన భాష ఏడుపు మాత్రమే. కాబట్టి వారి ఏడుపుకు కారణం ఏంటో ప్రతి తల్లీ అర్థం చేసుకోవాలి. ఆకలి వల్ల పిల్లలు ఏడుస్తారు. పాలు తాగిన తర్వాత సైలెంట్ అయిపోతారు. పుట్టిన తరువాత, శిశువు మూడు నెలల పాటు ప్రతి గంటకు ఆకలిగా అనిపిస్తుంది. తక్కువ స్వరంతో ఏడవడం ద్వారా వారు పాలు కావాలని మీకు సూచిస్తారు. కేవలం ఆకలి వల్లే కాదు ఇతర కారణాలు వల్ల కూడా వారికి ఏడుపు వస్తుంది. పొట్టలో పాలు ఉన్నప్పటికీ వారు ఏడుస్తుంటే ఇతర కారణాలు ఏమున్నాయో తెలుసుకునేందుకు ప్రయత్నించండి.

**తడి డైపర్**

చంటి పిల్లలకు తడి డైపర్లు చికాకుగా ఉంటాయి. దాని వల్ల వారు అసౌకర్యంగా భావించి ఏడవడం ప్రారంభిస్తారు. పిల్లలు ఏడస్తున్నప్పుడు డైపర్లు కూడా చెక్ చేయడం మర్చిపోవద్దు. పిల్లల డైపర్ తెరిచి, అది తడిగా ఉందో లేదో తనిఖీ చేయండి. డైపర్ తడిగా ఉంటే వెంటనే మార్చండి.

**ఓవర్ ఫీడింగ్**

చాలాసార్లు పిల్లలు తెలిసో తెలియకో అతిగా పాలు తాగేస్తారు. దీంతో పొట్ట అసౌకర్యంగా మారి ఏడవడం ప్రారంభిస్తారు.
దీని వల్ల వారి కడుపు ఉబ్బి అజీర్తి వంటి సమస్యలు వస్తాయి. అలాంటప్పుడు మీరు పిల్లలకు దగ్గరగా ఉండి వారికి సపోర్ట్ ఇవ్వాలి. తాగిన పాలు వాంతి చేసుకున్నా కంగారు పడకండి. దీని వల్ల వారి పొట్ట ప్రశాంతంగా ఉంటుంది.

**దుస్తులతో అసౌకర్యం**


వాతావరణానికి అనుగుణంగా పిల్లలకు దుస్తులు వేయాలి. ఒక్కోసారి వారు వేసుకునే దుస్తులు వారికి ఇబ్బందిగా మారుతాయి. దీని వల్ల పిల్లలు ఏడవడం మొదలుపెడతారు. అంతేకాకుండా బిగుతైన దుస్తులు ధరించడం వల్ల పిల్లలు అసౌకర్యానికి గురై బిగ్గరగా ఏడవడం ప్రారంభిస్తారు. చంటి పిల్లలకు వదులుగా ఉండే దుస్తులే వేసేందుకు ప్రయత్నించండి. పిల్లలు ఏడుస్తున్నప్పుడు వేసుకున్న దుస్తుల్లో వారికి గాలి తగులుతుందో లేదో కూడా చెక్ చేయండి.
రాత్రి పూట పిల్లలు నిద్రపోకుండా ఇబ్బంది పెడుతుంటారు. ఎందుకంటే నాలుగు నెలల వయసు వరకు వారి సిర్కాడియన్ రిథమ్స్ సెట్ కాదు. అంటే ఏ సమయంలో నిద్రపోవాలి, ఎప్పుడు లేవాలి లాంటి విషయాలు. అంతవరకు తల్లి ఓపికగా ఉండాలి. నాలుగు నెలల వయసు తరువాత వారి నిద్రసమయాలు ఫిక్స్ అవుతాయి.

# కనీసం 3 రోజులు బుకింగ్ చేసుకోవాల్సిందే..



రోజుకు రూ. 84 లక్షలు.. కనీసం 3 రోజులు బుకింగ్ చేసుకోవాల్సిందే.. ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన హోటల్ ఇదే..

ద్వీపం అనేది చుట్టూ నీళ్లతో నిండిన ప్రదేశం. అయితే, ఇవి చూసేందుకు ఎంతో అందంగా ఉంటాయి. ఇక్కడికి వెళ్లాలని ప్రతీ ఒక్కరూ కోరుకుంటారు. ఓ దీవిలోని హోటల్ అద్దె చూస్తే, కళ్లు బైర్లు కమ్మేస్తాయనడంలో ఎలాంటి సందేహం లేదు. అవును, ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా నుంచి రెండు గంటల దూరంలో ఉన్న బన్వా ప్రైవేట్ ఐలాండ్ ప్రపంచంలోనే అత్యంత ఖరీదైన రిసార్ట్‌లలో ఒకటిగా పేరుగాంచింది. ఈ రిసార్ట్ రోజువారీ అద్దె దాదాపు రూ.84 లక్షలు. కానీ, దీనితో షరతు ఏమిటంటే కనీసం మూడు రోజుల కోసారి బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దాదాపు 15 ఎకరాల్లో విస్తరించి ఉన్న ఈ ద్వీపం ఫిలిప్పీన్స్‌లోని పలావాన్ దీవుల్లో భాగం. ఈ రిసార్ట్ అన్ని వైపులా నీటితో చుట్టుముట్టబడి ఉంది. అందువల్ల, ఈ రిసార్ట్‌కు చేరుకోవడానికి మీరు ఫిలిప్పీన్స్ రాజధాని మనీలా నుంచి సీప్లేన్‌ను ఉపయోగించాల్సి ఉంటుంది. దీనికి రెండు గంటల సమయం పడుతుంది. ఇది కాకుండా, మీరు శాన్ విసెంటే నుంచి హెలికాప్టర్ ద్వారా పలావాన్ చేరుకోవచ్చు. మీరు హెలికాప్టర్‌లో 10 నిమిషాల్లో అక్కడికి చేరుకుంటారు. 1780 బనావా ద్వీపం ఆఫ్ ఫారెస్ట్ ఐలాండ్స్‌లో ఒకేసారి 48 మంది అతిథులు వసతి పొందగలరు. ఈ ద్వీపంలో మొత్తం 6 విల్లాలు ఉన్నాయి. ఒక విల్లాలో నాలుగు బెడ్‌రూమ్‌లు, ఒక ప్రైవేట్ ఇన్ఫినిటీ పూల్, జాకుజీ మొదలైన సౌకర్యాలు ఉన్నాయి. ఈ హోటల్ అద్దె గురించి చెప్పాలంటే, ఒక బెడ్‌రూమ్‌లో ఇద్దరు అతిథులకు రోజుకు సుమారు రూ.2.23 లక్షలు. అయితే, దీన్ని బుక్ చేయడానికి షరతు ఏమిటంటే, మీరు మూడు రోజులు బుక్ చేసుకోవాల్సిందే. ఒక విల్లాలో నాలుగు బెడ్ రూములు ఉన్నాయి.




# జిగ్రా కోసం ఖుషీకపూర్ ఎమోషనల్..



బాలీవుడ్ మోస్ట్ వాంటెడ్ మూవీ అలియాభట్ ‘జిగ్రా’. తమ్ముడికోసం అక్క చేసే పోరాటమే ప్రధాన ఇతివృత్తంగా రూపొందిన ఈ చిత్రానికి వాసన్ బాలా దర్శకుడు. ఇందులో అలియా తమ్ముడిగా వేదాంగ్ రైనా నటించాడు. నిజానికి ఈ సినిమా ఈ నెల 27న విడుదల కావాల్సింది. అయితే.. అదే రోజున ఎన్టీఆర్ ‘దేవర’ చిత్రం విడుదల కానుండటంతో ‘జిగ్రా’ను రెండు వారాలకు పోస్ట్‌పోన్ చేశారు నిర్మాతలు. ఈ సినిమా అక్టోబర్ 11న విడుదల కానుంది. ఇది లావుంటే.. ఈ సినిమా ట్రైలర్‌ను శ్రీదేవి చిన్న కుమార్తె ఖుషీకపూర్ తన ఇన్‌స్టాగ్రామ్ ద్వారా పంచుకున్నది. హార్ట్ సింబల్‌తోపాటు ఎమోషనల్ ఫేస్ ఎమోజీలను కూడా ఆ పోస్ట్‌లో పొందుపరిచింది ఖుషి. ఇందులో అలియా తమ్ముడిగా కీలక పాత్ర పోషించిన నటుడు వేదాంగ్ రైనాతో ఖుషి ప్రేమలో ఉన్నట్టు గత కొంతకాలంగా వార్తలు వస్తున్నాయి. దాంతో ఖుషీ తాజా పోస్ట్ బీటౌన్‌లో చర్చనీయాంశంగా మారింది.

# యాడ్ కోసం ఐదు కోట్లు

## తీసుకున్న ..తార

దక్షిణాదిలో తిరుగులేని ఫాలోయింగ్‌తో అగ్ర కథానాయికగా కొనసాగుతున్నది నయనతార. ఆమెను అభిమానులు లేడీ సూపర్‌స్టార్ అని పిలుచుకుంటారు. సౌత్ ఇండస్ట్రీలోని అగ్ర హీరోలతో సమానంగా ఈ భామ స్టార్‌డమ్‌ను సంపాదించుకుంది. ‘జవాన్’ సినిమాతో నయనతార దేశవ్యాప్తంగా పాపులర్ అయింది. ప్రస్తుతం ఆమె ఒక్కో సినిమాకు పది కోట్ల రెమ్యునరేషన్ డిమాండ్ చేస్తున్నట్లు తెలిసింది. తాజాగా యాభై సెకన్ల నిడివి కలిగిన ఓ కమర్షియల్ యాడ్ కోసం నయనతార ఏకంగా ఐదు కోట్లు పారితోషికం అందుకోవడం సంచలనంగా మారింది. దక్షిణాది పరిశ్రమలో ఇదొక అరుదైన రికార్డని, ఇప్పటివరకు ఏ కథానాయిక కమర్షియల్ యాడ్ కోసం అంత భారీ మొత్తంలో రెమ్యునరేషన్‌ను పొందలేదని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. డీటీహెచ్ సంస్థ టాటా స్కై కోసం రూపొందించిన యాడ్‌లో నయనతార నటించిందని చెన్నై సినీ వర్గాల్లో వినిపిస్తున్నది. ప్రస్తుతం నయనతార టెస్ట్, మన్నన్‌ఘట్టి 1960, డియర్ స్టూడెంట్, తని ఒరువన్2 చిత్రాల్లో నటిస్తున్నది.



# దేవర ట్విట్టర్ రివ్యూ వచ్చేసింది..

## ఎన్టీఆర్ బ్లాక్ బస్టర్ కొట్టాడా ?





దేవర రిలీజ్ కోసం ఎన్టీఆర్ అభిమానులే కాదు.. యావత్ సినీ ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. ఎందుకంటే ఎన్టీఆర్ ఆరేళ్ల తర్వాత సోలోగా దేవరగా రాబోతున్నాడు.

నేడు థియేటర్స్‌లో విడుదలైన ఈ సినిమా ట్విట్టర్ రివ్యూ వచ్చేసింది.

జనతా గ్యారేజ్ తర్వాత ఎన్టీఆర్, కొరటాల శివ కాంబోలో వస్తున్న దేవర సినిమాపై ప్రేక్షకుల్లో భారీ అంచనాలే ఉన్నాయి. మరోవైపు రాజమౌళి సెంటిమెంట్ ఎన్టీఆర్ ఫ్యాన్స్‌కి భయం కలిగిస్తున్నా సరే.. ట్రైలర్, టీజర్ చూసి ఆ యంగ్ టైగర్ ఫ్యాన్స్ కాలర్ ఎగరేసుకునేలా దేవర ఉండనుందని ఫిక్స్ అయిపోయారు. ఆల్రెడీ చాలా చోట్ల షోలు పడ్డాయి. సినిమా చూసిన ప్రేక్షకులు ట్విట్టర్ ద్వారా తమ అభిప్రాయాలను షేర్ చేసుకుంటున్నారు. ఇంతకీ దేవర్ హిట్టా.. ఫట్టా అంటే?

దేవర ప్రీమియర్, బెనిఫిట్ షో చూసిన వారి టాక్ ప్రకారం.. దేవరలో ఎన్టీఆర్ ఎంట్రీ అదిరిపోయిందట. టైటిల్ కార్డ్, ఎంట్రీ సీన్స్ సమయంలో వచ్చే బ్యాక్ గ్రౌండ్ గూస్ బంప్స్ తెప్పింస్తుందట. అది ఓ అద్భుతమని అంటున్నారు ఫ్యాన్స్. ఇకపోతే సోషల్ మీడియాలో రికార్డులు తిరగరాస్తున్న పాటలు చూడటానికి చాలా బాగున్నాయట.

జాన్వీ కపూర్ ఎంట్రీ సీన్ కూడా ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటుందట. అండర్ వాటర్ సీక్వెన్స్, యాక్షన్ ఎపిసోడ్స్, ఇంటర్వెల్ బ్లాక్.. ఫస్ట్ హాఫ్ కి హైలెట్ అంటున్నారు. ద్విపాత్రాభినయం చేసిన ఎన్టీఆర్ రెండు రోల్స్‌ని చించేస్తూ.. మరోసారి ఆల్ రౌండర్ అనిపించుకున్నాడంట.

ఇక సెకండాఫ్ విషయానికి వస్తే యాక్షన్ సీన్స్ ఇష్టపడేవారికి ఫుల్ మీల్స్ పెట్టిదంట. రెండు ఫైట్లు చాలా అద్భుతంగా వచ్చాయని.. అవి సినిమాను ఎక్కడికో తీసుకువెళ్లాయని అంటున్నారు. వాటికి రత్నవేలు సినిమాటోగ్రఫీ, అనిరుధ్ మ్యూజిక్ అదుర్స్ అని అంటున్నారు. ఎన్టీఆర్.. దేవర, వరగా సినిమాలో కనిపించగా.. వర ఫ్లాష్ బ్యాక్ ఎపిసోడ్‌కి మంచి హైప్ ఉంటుందట. మాస్ ఎలివేషన్లు, ఎన్టీఆర్ చెప్పినట్టుగానే చివరి 40 నిమిషాలు ప్రేక్షకులని సీట్లో కూర్చోకుండా చేశారని అంటున్నారు.

జాన్వీ స్క్రీన్ ప్రెజెన్స్, సైఫ్ అలీఖాన్ నటన అద్భుతంగా కుదిరాయని, సినిమాలో ఈ పాత్రని చాలా బాగా డిజైన్ చేశాడట కొరటాల. మొత్తంగా ఇది మంచి కమర్షియల్ ఎంటర్టైనర్ మూవీ అని అంటున్నారు. మరోవైపు కొందరు సినిమాలో చాలా స్లో నెరేషన్ అని, విజువల్స్ పూర్‌గా ఉన్నాయని అంటున్నారు. ఫస్ట్ ఆఫ్ పెద్దగా ఆకట్టుకోలకపోయిందని కామెంట్స్ పెడుతున్నారు. ఫ్యాన్స్ మాత్రం ఎన్టీఆర్ రికార్డ్స్ బ్రేక్ చేయడం, బాక్సాఫీస్ షేక్ అవ్వడం పక్కా అంటున్నారు. ఓవరాల్‌గా సినిమా బ్లాక్ బస్టర్.

Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com